క్లుప్తంగా

పేరెంట్స్ మీటింగ్‌ను జయప్రదం చేయండి


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్

పాణ్యం : స్థానిక ప్రభుత్వ పాఠశాలలో గురువారం జరిగే పేరెంట్స్ సమావేశాన్ని జయప్రదం చేయాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలమూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. డీఈఓ మాట్లాడుతూ గురువారం జరిగే పెరేంట్స్ సమావేశానికి విద్యార్థుల తల్లిందడ్రులు హాజరు కావాలన్నారు. అంతేకాక పాఠశాలో విద్యార్థులకు అందించే అన్ని రకాల సేవలను తెలియజేయాలన్నారు. గడువులోగా సమావేశం నిర్వహించాలన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి


టీకాలను పరిశీలిస్తున్న డా.రఘు

ఓర్వకల్లు : ఐదేళ్లలోపు చిన్నారులకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలను తప్పని సరిగా వేయాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. బుధవారం హుసేనాపురం ప్రథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయంలో జరుగుతున్న సంచార వైద్య చికిత్సను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అందించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యురాలు కృష్ణబాయి, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు ప్రకాష్, సామాజిక ఆరోగ్య అధికారిణి సుకన్య తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయండి


మాట్లాడుతున్న ఎంపీపీ బొంతల మునెప్ప

సి.బెళగల్: గ్రామాల్లో పనిచేసే ఉద్యోగులు, అధికారులు కలిసికట్టుగా మండల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల మండల అధికారులకు, సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ రాణెమ్మ అధ్యక్షతన పంచాయతీల పురోగతి సూచికపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారాలపై సూచనలు చేశారు. కార్యక్రమానికి ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు గోనేనాయక్, వెంకటప్రకాష్, ఐసీడీఎస్, హెల్త్ సూపర్‌వైజర్లు పద్మావతి, మంగమ్మ, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎం తదితరులు హాజరయ్యారు.

మురుగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


మురుగునీటితో నిండిన కల్వర్టును పరిశీలిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

కోడుమూరు రూరల్: గూడూరులోని తెలుగువీధిలో మురుగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు గూడూరు మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్ తెలిపారు. మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సాయంత్రం గూడూరు నుంచి ఎమ్మిగనూరు వెళ్లే రోడ్డులో మహిళలు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో బుధవారం చైర్మన్, వైస్ చైర్మన్ మున్సిపల్ సిబ్బందితో కలిసి కాలనీని సందర్శించడంతో పాటు, పూడికతో నిండిపోయిన కల్వర్టును తొలగించి అందులో పైపులు వేసేలా చర్యలు చేపట్టారు. దీంతో ఏళ్లతరబడిగా కాలనీలో నెలకొన్న మురుగునీటి సమస్య తీరిపోనుంది.

పల్లె ప్రగతికి ప్రాధాన్యత ఇవ్వాలి

కర్నూలు(రూరల్): గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కర్నూలు మండల ఎంపీడీవో జి.రఘునాథ్ అన్నారు. కర్నూలు మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో బుధవారం గ్రామ పంచాయతీ పురోగతి సూచికపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాల్లో అమలు చేయాలని, ప్రజల అవసరాలు, ఆదాయ వనరులను గుర్తించి అన్నింటిపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, మండలప్రజా పరిషత్ కారాలయ అధికారులు జాకిర్ హుస్సేన్, చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో మోసం గ్యారెంటీ


క్యూఆర్‌కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నాయకులు


పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

- ఏడాదైనా హామీలు అమలు చేయకుండా కాలయాపన
- ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ మోసాలను ఎండగట్టాలి
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పాణ్యంలో రీకాంలింగ్ చంద్రబాబు

పాణ్యం : చంద్రబాబు ఎన్నికల్లో అలివిగాని హామీలు ఇచ్చి.. అధికారం వచ్చిన తర్వాత ఓట్లు వేసిన ప్రజలను నిలువునా మోసం చేశారని, ఇది ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఏనాడూ ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. నాలుగోసారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన ఆయన ఎన్నికల ముందు 150కి పైగా హామీలు ఇచ్చారని, ఇప్పుడేమో సూపర్‌సిక్స్ పథకాలు ఇచ్చేందుకే నానా కొర్రీలు పెట్టి ఎగ్గొడుతున్నారన్నారు. ఏడాది పాలన పూర్తయినా సూపర్‌సిక్స్ అమలు చేయకపోగా అబద్ధాలతో ప్రతిపక్షాల మీద బురదజల్లుతున్నారన్నారు.

ప్రతి కుటుంబానికి చంద్రబాబు రూ.లక్ష బాకీ

చంద్రబాబు ఎంత అప్పు బాకీ పడ్డారో ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇందు కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఇచ్చి హామీల ప్రకారం ప్రతి ఇంటికి రూ. లక్షలకు పైగా చంద్రబాబు అప్పు పడ్డారన్నారు.

అక్రమ వసూళ్లతో ప్రజలు హడల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమ వసూళ్లతో ప్రజలు, వ్యాపారులు, ఇతర పారిశ్రామికవేత్తలు హడలిపోతున్నారన్నారు. టీడీపీ కార్యకర్త నుంచి పెద్దస్థాయి లీటర్ల వరకు వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారన్నారు. తమ్మరాజుపల్లె గ్రామంలో గ్రావెల్ తవ్వకాలకు వసూళ్ల యథేచ్ఛగా సాగుతుందన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో టీడీపీ నాయకుల బేరాలు మిన్నటింపోయాయన్నారు. ఇవే కాకుండా పొలాలకు, ఇతర ప్రభుత్వ పథకాల కోసం వసూళ్లు చేసి దండుకుంటున్నారన్నారు.

పోలీసులు ఇంతలా దిగజారాలా?

ప్రభుత్వాలు వస్తుంటాయి .. పోతుంటాయి.. కాని తన రాజకీయ జీవితంలో మొదటిసారిగా పోలీసులు దిగజారి ఉద్యోగాలు చేయడం ఇప్పుడే చూస్తున్నానని కాటసాని అన్నారు. పాణ్యం మండలం గోరుకల్లు గ్రామంలో మొహర్రం వేడుకలను ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహిస్తారని, కాని కూటమి ప్రభుత్వం అధికారిలోకి వచ్చాక దేవుళ్లను పోలీసు సమక్షంలో లాగేసుకోని అధికారి పార్టీ నాయకులు ఇష్టానుసారంగా చేస్తుంటే చోద్యం చూస్తున్నారున్నారు. ఈ విషయంపై ట్రస్ట్ కోర్టును ఆశ్రయిస్తే ట్రస్ట్‌కు దేవుళ్ల ఆభరణాలు అప్పగించాలని తీర్పు ఇచ్చిందన్నారు. అయినా స్థానిక పోలీసు అధికారి మాత్రం ట్రస్ట్ సభ్యులను బెదిరించడం సిగ్గుచేటన్నారు.

ఎస్సార్బీసీకి నీళ్లెప్పుడిస్తారు?

ఈ ఏడాది శ్రీశైలానికి ముందగానే నీళ్లొచ్చినా ఇంకా ఎస్సార్బీసీ ఆయకట్టుకు ఎందుకు నీళ్ల వదలడం లేదని ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు నుంచి విడుదల చేసిన నీటిని వెలుగోడు, కుందూ వదలుతన్నారని, ఎస్సార్బీసీ ఆయకట్టుకు ఎప్పుడు వదులుతారని, నీటి కోసం రైతులు ఇంతలా ఎదురు చూడాలా అని ప్రశ్నించారు. అనంతరం చంద్రబాబు మోసాలపై క్యూర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, మాజీ సర్పంచ్‌లు సుబ్బరాయుడు, పుల్లయ్య, జాకీర్‌ఉసేన్, రవిరెడ్డి, జయచంద్రారెడ్డి, భాస్కరెడ్డి, సద్దల శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ పక్కాగా జరగాలి

కల్లూరు: గ్రామాల్లో చెత్త సేకరణ పక్కాగా జరగాలని ఎంపీడీఓ నాగేషాచలరెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం తడకనపల్లె మజర గ్రామమైన వామసముద్రంలో జరుగుతున్న చెత్త సేకరణను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ

కల్లూరు: రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్ అభియాన్‌లో భాగంగా పంచాయతీల అభివృద్ధి సూచిక 2.0పై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీఓ నాగేషాచలరెడ్డి నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ఏఎన్‌ఎమ్‌లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

పాణ్యం : గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచికపై గ్రామాల కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధికి సూచికకు సంబధించి ర్యాంక్‌ల విధానంపై చర్చించారు. అలాగే పంచాయతీ పరిధిలో ఉన్న వనరులు వాటి వలన కలిగే ప్రయోజనాలపై ఆరార తీశారు. కార్యక్రమంలో ఎంఈఓ కోటయ్య, ఏపీఓ శేషన్న, ఏపీఓ ప్రసాద్ పాల్గొన్నారు.

సిఫారసు చేసిన విత్తనాలనే విత్తుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఓర్వకల్లు : పొగాకు సాగు చేసే రైతులు సంబంధిత కంపెనీలు సిఫారసు చేసిన విత్తనాలను మాత్రమే విత్తుకోవాలని వ్యవసాయాధికారి, డీఆర్‌సీ ఏడీఏ రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని హుసేనాపురం గ్రామంలోని పత్తి పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి మధుమతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాజశేఖర్‌తో పాటు, డిఆర్‌సీ ఏఓ శశిధర్‌రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పత్తి పంటలో శాస్త్రీయ పద్ధతుల ద్వారా రసం పీల్చు పురుగు ఉధృతిని నివారించుకోవచ్చన్నారు. రైతులు సాగు చేసిన పత్తి పంటను వారు పరిశీలించారు. అనంతరం పొగాకు నారుమడుల తయారీలను పరిశీలించారు. పొగాకు నారుమడులను తయారు చేసుకునే విధానం, మడికి మడికి మధ్య ఎంత దూరం వుండాలి, ఎంత ఎత్తులో నారుమడి చేయాలని, వాటిలో విత్తనాలను ఏవిధంగా విత్తుకోవాలనే శాస్త్రీయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ నెల 15వ తేదీ నుంచి సెప్టెంబర్ 15 మధ్య కాలంలో వర్జీనియా, లంక, బీడి, నాటు పొగాకు విత్తనాల నారుమడులకు అనువైన సమయం అన్నారు. అదేవిధంగా చుక్కబర్లి, పొగాకు నారుమడులు విత్తడానికి మే-జూన్ నెలలు అనుకూలమని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ మధు, విఏఏలు భువనేశ్వరి, గంగాధర్, మహేష్, హుసేనాపురం ఉప సర్పంచు షాహినా బీ, రైతులు పాల్గొన్నారు.

అధికంగా పురుగుమందులు పిచికారీ చేయొద్దు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త రామకృష్ణా రావు


సస్య రక్షణ పద్ధతులను వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్త సుజాత

కర్నూలు(రూరల్): పంటలకు పురుగు మందులు అధికంగా పిచికారీ చేయరాదని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టరు ఎ.రామకృష్ణా రావు, వ్యవసాయ శాఖ సంచాలకులు ఎస్ సాలు రెడ్డి రైతులకు సూచించారు. మండల పరిధిలోని జి. సింగవరం, ఎదురూరు గ్రామాల్లో బుధవారం పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పత్తి, కంది, మొక్కజొన్న పంటల సాగు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యానశాఖ అధికారులు మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కర్నూలు మండల వ్యవసాయ అధికారి రూఫస్ రోనాల్డ్, ఉద్యానశాఖ అధికారి నరేష్ పాల్గొన్నారు.

పత్తిలో సస్య రక్షణ పద్ధతులు పాటించాలి

కల్లూరు: పత్తి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్య రక్షణ పద్ధతులు పాటించాలని కేవీకే శాస్త్రవేత్త సుజాత అన్నారు. బుధవారం కల్లూరు మండలం పుసులూరు, బొల్లవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆ గ్రామాల్లో వివిధ దశల్లో పత్తి పంటలను సందర్శించారు. పత్తి పంటల్లో గులాబీ పురుగు ఉధృతిని గమనించి దాని నివారణకు లింగార్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పేను బంక నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 80ఎంల్/ ఎకరాకు, తెల్ల దోమ నివారణకు అస్టామాప్రైడ్ 100 గ్రాములు/ ఎకరాకు, డైపెన్‌త్రియన్ 250 ఎం.ఎల్/ ఎకరాకు పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆస్తులమ్మిన ఆత్మలు

- చనిపోయిన వారి పేరుతో స్థల రిజిస్ట్రేషన్
- వారసుల రాకతో బహిర్గతం


నిందితుల అరెస్టును చూపుతున్న కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్ఐ ఎర్రిస్వామి

కోడుమూరు రూరల్: చనిపోయిన వారిని బతికి ఉన్నట్లు చిత్రీకరించి వారి పేర్ల మీద ఉన్న ప్లాట్‌ను ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు కొందరు కేటుగాళ్లు. మృతుల వారసులు రాకతో ఈ మోసం బయటపడింది. బుధవారం కోడుమూరు సీఐ తబ్రేజ్ తెలిపిన వివరాల మేరకు.. కోడుమూరుకు చెందిన కాకే నారాయణ, కాకే నాగరాజు అనే వ్యక్తులు 1984లో పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఉన్న సర్వే నెంబర్ 100లో ఐదు సెంట్ల ప్లాటును కొని తమ పేరుపై రిజిస్టర్ చేసుకున్నారు. 2014లోపే వారిద్దరు అనారోగ్యంతో చనిపోయారు. ఇటీవల ఆ ఇరువురి వ్యక్తులకు సంబంధించిన కుటుంబ సభ్యులు ప్లాటును చూసేందుకు రాగా కొలిమి పని చేసుకునే రామగిడ్డయ్య, నల్లబోతుల మద్దిలేటి అనే వ్యక్తులు వచ్చి ఈ ప్లాటును తాము కొన్నామని చెప్పారు. చనిపోయిన వ్యక్తులు మీకు ప్లాట్లు ఎలా అమ్ముతారంటూ కాకే నారాయణ భార్య లీలావతి కోడుమూరు ఎస్ఐ ఎర్రిస్వామిని ఆశ్రయించారు. విచారణ చేపట్టగా మోసం బయటపడింది. కల్లపరి సోమేష్, బోయ మధు, వర్కూరు గిడ్డయ్య, విష్ణు అనే ప్లాట్ల వ్యాపారులు విలువైన ఐదు సెంట్ల స్థలాన్ని కాజేయాలని పథకం రచించారు. ఇందులో భాగంగా చనిపోయిన కాకే నారాయణ, కాకే నాగరాజుల స్థానంలో పెద్ద నేలటూరుకు చెందిన నాగేష్ ద్వారా అదే గ్రామానికి చెందిన బోయ నారాయణ, గుడేకల్ గ్రామానికి చెందిన ఎం.నాగరాజు అనే నకిలీ వ్యక్తులను తీసుకుని వచ్చి 2023 సంవత్సరంలో కోడుమూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది సహకారంతో కల్లపరి సోమేష్ పేరు మీద ఎక్కించుకున్నారు. అనంతరం ఈ ప్లాటును వీరందరూ మూకుమ్మడిగా ఇతరులకు రూ.18 లక్షలకు విక్రయించి వచ్చిన సొమ్మును సమానంగా పంచుకున్నారు. విచారణలో నిజనిజాలు బయటపడడంతో ప్లాట్లను విక్రయించిన కల్లపరి సోమేష్, బోయ మధు, రాజోలి గిడ్డయ్య, బోయ నారాయణ, మాదాసులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని, నాగరాజు, విష్ణుతో పాటు కేసులో భాగమున్న మరికొందరు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు సీఐ తబ్రేజ్ తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి


కాటసానిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కల్లూరు : వైఎస్సార్‌సీపీలో రాష్ట్ర, జిల్లా, మండల విభాగాల్లో పదవులు పొందిన వారందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల్లో పదవులు పొందిన పలువురు నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.కిషన్, రాష్ట్ర ఎస్వీ సెల్ ప్రధాన కార్యదర్శి రైల్వే ప్రసాద్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు ప్రభుదాస్, జిల్లా యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్ సి.నవీన్, జిల్లా సాంస్కృతిక ప్రధాన కార్యదర్శి సి.యోగేష్, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మన్న, జిల్లా వాలంటరీ విభాగం వైస్ ప్రెసిడెంట్ ఉపాధ్యక్షులు టీఎండీ అస్లాం ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

కోడుమూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండేలా చూసుకోవాలని స్పెషల్ కలెక్టర్, హౌసింగ్ పీడీ చిరంజీవి హెచ్‌ఎంలు, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం గూడూరు మండలం గుడిపాడు, జూకల్, కె.నాగలాపురం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయడంతో పాటు విద్యార్థులతో మాట్లాడారు. చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులంతా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. అలాగే గురువారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మెగా పేరెంట్స్ మీటింగ్‌లే నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని ఆదేశించారు. కార్యక్రమంలో గూడూరు ఎంఈఓ సునీలమ్మ ఉన్నారు.



గుడిపాడు పాఠశాలను పరిశీలిస్తున్న స్పెషల్ కలెక్టర్, హౌసింగ్ పీడీ చిరంజీవి

నల్ల చట్టాలను రద్దు చేసే వరకు పోరాటం



కోడుమూరులో ధర్నా నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు



సి.బెళగల్లో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

కోడుమూరు రూరల్: కార్మికులకు నష్టం కలిగించే నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసే వరకు పోరాటం ఆపేది లేదని కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు క్రిష్ణ, సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్లా హెచ్చరించారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం కోడుమూరులోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి కృషి చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కడుపులు కొట్టే చర్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఓ వైపు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో తల్లడిల్లుతున్న కార్మికులపై కేంద్రం తెచ్చిన నల్ల చట్టాలు గోరు చుట్టుపై రోకలి పోటులా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి, సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు రాజు, కె.రాజు, గఫూర్‌మియ్యా, చిన్నరాముడు, పెద్ద వీరన్న, శేషుయాదవ్, మనోహర్, సూలమ్మ, సువేదా సులోచన తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో..

లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం గూడూరులో సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్, నాయకులు వెంకటేశ్వర్లు, నాగేంద్రమ్మ, కృప, శేషమ్మ, శాంతన్న, రాజు, నగేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

- **సి.బెళగల్:** మండల కేంద్రం సి.బెళగల్లో కార్మిక చట్టాల రద్దు కోరుతూ కార్మిక సంఘాలు ఆందోళన కార్యక్రమం నిర్వహించాయి. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ పార్కు నుంచి బస్టాండ్ వరకు కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. తర్వాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుంటప్ప, మండల నాయకుడు ఖాజాహుసేన్, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, హమాలీ సంఘాలు నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.
- **గడివేముల:** దేశవ్యాప్త సార్వత్రికసమ్మెలో భాగం మండల కేంద్రంలోని పాత బస్టాండు నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్నభోజన నిర్వాహకులు, వీఏఏలు,ఆటో కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీతో పాటు మానవహారం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు నరసింహ నాయక్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ లీడర్స్ వసంతమ్మ, రాములమ్మ, ఆశా వర్కర్స్ చెన్నమ్మ, ఆశాబీ, మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.
- **ఓర్వకల్లు:** ఏపీ వ్యవసాయ, కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న ఆధ్వర్యంలో స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సమ్మెలో భాగంగా ఆశా వర్కర్లు, సీఐటీయూ, కేవీపీఎస్, డీవైఎఫ్ఐ నాయకులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రజా, రైతు సంఘాల నాయకులు సుధాకర్, మద్దిలేటి, రామకృష్ణ, మహేష్, మాసుంబాష, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

పాణ్యం : స్కీమ్ వర్కర్‌లను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని, లేబర్‌కోడ్‌ను రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా స్థానిక షాదఖానా నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌ను తెచ్చిందన్నారు. కార్మికులకు 8కి బదులు 10 గంటలకు మార్చడంపై కార్పొరేట్ సంస్థలకు లబ్ధిచేకుర్చే విధానం అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్‌లు, తులసి ఆటోయూనియన్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత

ఓర్వకల్లు: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ×స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్×లో భాగంగా మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. స్థానిక ఎస్సీ కాలనీలో నిర్మించిన మురుగునీటి కాల్వలు, సీసీ రోడ్లపై వర్షనీరు నిల్వవుండడం, ఇళ్ల సమీపంలో చెత్తను వేయడం వల్ల ప్రజలకు కలిగే అనర్థాల గూరించి అవగాహన కల్పించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి, గ్రీన్ అంబాసిడర్లు వున్నారు.

పీజీఆర్ఎస్ వినతులపై నిర్లక్ష్యం వద్దు

గడివేముల: పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చే వినతుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని నంద్యాల జిల్లా పంచాయతీ అధికారి లలితాబాబు ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని బిలకలగూడూరు సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని ఇంటింటి చెత్తసేకరణ, గ్రామంలోని వీధులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రోడ్ల మీద నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. మురుగునీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలరన్నారు. మంచినీటి ట్యాంకులను నిర్ణీత సమయంలో శుభ్రం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మహీధర్‌రెడ్డి, సర్పంచ్ వెంకట నారాయణ, పంచాయతీ కార్యదర్శి. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.